**రాధ** ఇడ్లీల్లో కని మిక్సీలో కొబ్బరి చెట్నీ వేసింది అప్పుడే. రాధ రెండో కొడుకు సుదీప్ హడావిడిగా స్నానం చే సొచ్చి కాన్వెంటు డ్రెస్ వేసుకుంటూ - మమ్మీ! తొందరగా బ్రేక్‌ఫాస్ట్ పెట్టు. కాన్వెంటుకి టైమైంది అంటూ తొందర చేశాడు.'ఒరేయ్ సుదీప్! మమ్మీ అని పిలవద్దని అమ్మ ఎన్నిసార్లు చెప్పినా వినవే. అమ్మ క్కోవం వస్తుందని తెలీదూ!'ఇప్పుడేం రాదులే. డాడీ ఉన్నారుగా డాడీ నన్నే వెనకేసుకొస్తారు. అయినా ఏంటన్నయ్యా నువు మరీను అమ్మా! నాన్నా! అని పిలవడం ఎంత కష్టంగా ఉంటుంది. అలా పిలిస్తే మా ఫ్రెండ్సంతా అందరూ నవ్వుతారు. ఇంగ్లీమ కాన్వెంటులో చదువుతూ... మమ్మీ! డాడీ అంటే ఎంత ఈజీగా ఉంటుంది."ఇంతలో కరెంట్ పోయింది. మిక్సీలో పచ్చడి సరిగా కానేలేదు. మిక్సీ గొడవలో ఏళ్ల మాటలూ వినలేదు. రాధకి కంగా రెక్కువైంది. ఇడ్లీలో కొబ్బరిచెట్నీ లేకపోతే పిల్లలు నానా గేలా చేస్తారు. ఓ వక్క టైమైంది వీళ్ల కాన్వెంటుకి. రిక్షా వాడు ఒక్క నిముషం లేటైనా వెళ్లిపోతాడు. వాడి దుంపతెగ వాడు మరీ స్ట్రిక్టు. వెధవ కరెంట్ ఇప్పుడే పోవాలా! ఎనిమిది గంటలయేసరికల్లా మర్చిపోకుండా ఆ స్విచ్ బోర్డు పక్కనే కూచుంటాడల్లే ఉంది. ఠక్కున తీసేస్తాడు. ఇక రాత్రి మరీ నరకం 7.50 నుంచి 9 దాకా తీసేస్తాడు. ఓ వక్క దోమలు. ఇక నరకమే.

శుక్రవారం అర్ధరాత్రి హిందీ సినిమా 'మహల్' వస్తోందని చూసింది. అందులో ఆయేగా... ఆయేగా పాటంటే తన కెంతో ఇష్టం. అన లా పాట కోసమే చూసింది. ఆ పాట వీడియోలో రికార్డు చేసుకుని తెల్లారగానే ఆయేగా... ఆయేగా... అంటూ పాడుతూ పని చేసుకోడంతో టైము తెలీలేదు. ఇక గమ్మున 'గ్యాస్ స్టౌ' వెలిగించి శనగపిండి చట్నీ చేసింది. బామ్మ ఆ చట్నీని చింతామణి చట్నీ అంటూ ఉండేది. ఇప్పుడు దానికి ఏ ఫేషన్ పేరో పెట్టకపోతే పిల్లలు విసిరికొడతారు తినకుండా.



పాపం! ఇంటిల్లిపాదికీ గ్యాస్ స్టౌ లేకపోయినా ఆ కుంపటి, పొయ్యి లేకపోతే కిరోసిన్ స్టౌ మీద చేసేది వంటంతా! ఎంత పనో అలుపూ సొలుపూ లేకుండా చేసుకునేది బామ్మ. ఇప్పుడెన్ని సౌఖ్యాలున్నా ఇద్దరు పిల్లలకి, మొగుడికి వండి పెట్టేటప్పటికే నడుం పడిపోతోంది.

ఇక ఆ రోజు శనివారం కాబట్టి పిల్లలకి టిఫిన్ బాక్సు ఇవ్వనక్కరలేదు. అందుకని వంట హడావిడి లేదు. ఆ 'చింతామణి' చట్నీకి 'చింతకాయ్' చట్నీ అని పేరు పెట్టి ఇది మద్రాస్‌లో ఫేమస్‌రా అంటూ పిల్లల్ని ఎలానో నముదాయించి టిఫిన్ తినిపించి కాన్వెంటుకి పంపింది. ఇంతలో భయంకర గట్టిగా శబ్దం వినిపించి రాధ గమ్మున వంటింట్లోకి పరిగెట్టి ఏమిటాన చూస్తే కరెంట్ వచ్చి మిక్సీ తిరిగిపోతూ అందులో చట్నీ అంతా గోడల మీదా, టేబులు మీద, స్విచ్ ఆర్చేలోగా తన చీర మీద కూడా పడిపోయి వంటిల్లంతా ఘోరంగా తయారైంది.

ఈలోగా స్నానం చేసొచ్చి "రాధా! త్వరగా టిఫిన్ పెట్టు ఆఫీసుకి టైమవుతోంది" అంటూ వంటింట్లోకి వచ్చిన భర్త రవీంద్రకి వంటింట్లో బీభత్సం, రాధ అవతారం చూసి ఫక్కున నవ్వి - "ఏమిటోయ్! అలిగావా? అలిగితే గిన్నెల చప్పుడే ఇంతవరకు విన్నాగాని ఇ... చీర మీద, టేబులు మీద చట్నీలు కూడా విసిరేయడం... ఎందుకొచ్చిందబ్బా కోపం.

"చాల్లెండి మీ జోకులు! కావాలని మీద వేసుకుంటారా ఏమిటి? కరెంటు వచ్చి మిక్సీ తిరిగిపోయి ఇలా అయింది" అంటూ అంతా శుభ్రం చేసింది.

"చక్కగా రోట్లో చేయొచ్చుగా? ఊహూ! కరెంట్ పోతే చట్నీ చేయడం, గ్యాసయిపోతే వంటన్నా మానేస్తారు గాని నేటి ఆడవాళ్ళు ఇప్పుడు రోళ్ళు, కుంపట్లు చస్తే వాడరు."

రాధ ఆ మాటలకి చురుక్కున చూసి - "అన్నట్టు పక్కింటి వాళ్ళబ్బాయి రమణ వచ్చి అర్జంటుగా స్కూటరు కావాలంటే మీ స్కూటరు తీసుకెళ్ళాడు. ఇప్పుడే తెచ్చేస్తానంటూ."

"చంపేశావు. ఎందు కిచ్చావు. ఇప్పుడు నే నాఫీసు కెట్లా వెళ్ళేది? అసలే ఈ రోజు పెద్దాఫీసరు గారు వస్తారు."

'సైకిలు మీద వెళ్ళండి.'

"ఇంకా నయం నడిచి వెళ్ళమన్నావు కాదు. నీకు వేళాకోళంగా ఉంది. సరే టిఫిన్ వద్దు. ఏ ఆటోలోనో వెడతాలే."

"ఆగండాగండి! ఊరికే అన్నాను. అంత కోపమైతే ఎలాగండీ! ఏం నేను కుంపటి మీద వంట చేయాలా? రోట్లోనే చట్నీ చేయాలా? మీరైతే స్కూటరు లేకుండా సైకిలు మీద వెళ్ళలే రన్నమాట. ఏం పూర్వం స్కూటర్లున్నాయా? అలకమాని రండి టిఫిన్ చేద్దురుగాని."

"అంటే ని న్నన్నందుకు ఆ కక్ష ఇలా తీర్చుకున్నావా? ఒకటే గాబరా పెట్టేశావు కదోయ్" అంటూ రవీంద్ర టిఫిన్ చేస్తూ.... "అన్నట్టు ఈ రోజు మధ్యాహ్నం భోజనానికి రాను, ఆఫీసులో పని ఎక్కువగా ఉంటుంది. అదీగాక సాయంత్రం మూడు గంటలకి మీ తమ్ముడు వస్తాడుగా అందుకని రైలు స్టేషనుకి వెళ్ళాలి."

"అయితే వచ్చేటప్పుడు 'బోర్నవిటా' పట్రండి. మా తమ్ముడు కాఫీ తాగడు. ఎలాగూ పిల్లలకీ కావాలి. కస్టర్డు పౌడరు, ఫ్రూట్సు తెస్తే ఫ్రూట్ సలాడ్ చేస్తా - మా తమ్ముడి కిష్టం. సెనలు కూడా పట్రండి. సాయంత్రం సెనరట్లు వేస్తాను. అన్నట్టు ఒక రూపాయి తక్కువని ఎవరో మీ ఫ్రెండు చెబితే పంపించారు బియ్యం - దాన్నిండా రాళ్ళు, బెడ్డలు ఏరలేక చస్తున్నాను. ఆ బియ్యం మార్చేసి మంచి బియ్యం పంపమనండి. మా తమ్ముడు అలా ఉంటే తినలేడు."

"ఇంక అవుతావా దండకం. ఇంకా చంటిబాబు అనుకుంటున్నావా మీ తమ్ముడు బోర్నవిటా తాగడానికి? ఆరడుగుల ఆజానుబాహువు."



టీ.వీ.లో చెప్పుతున్నారు

టీచర్ : రామూ! మనకి విటమిన్లు, కార్బో హైడ్రేట్స్ ప్రోటీన్లూ వేటినుండి లభిస్తాయిరా?
రాము : బోర్నవీటా, హార్లిక్స్‌ల నుండి టీచర్. రోజూ టీ.వీ. లో చెప్తున్నారుగా అవే వాడమని!

జె.విశ్వప్రకాంత్
[హైదరాబాద్]

"నాకు వాడు ఎప్పటికీ చిన్నపిల్లాడే లెండి."

"అయినా ఏమిటోయ్ మీ వాళ్ళు వస్తే ఓ హడావిడి పడిపోతూ ఎన్నో చేస్తావు. ఇదే మా అమ్మ వస్తే ఫ్రూట్ సలాడ్ చేస్తావా? మీ తమ్ముడికైతే బోర్నవిటాలు అవీనా."

"హూ! మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. అత్తయ్య గారొచ్చినప్పుడు ఫ్రూట్ సలాడ్ చేస్తే 'వద్దమ్మా ఆ చల్లటివి నే తినలేను' అన్నారు. బోర్నవిటా ఆవిడ తాగుతారా! కాఫీలో కొంచెం పా లెక్కువపోసుకుని తాగుతారు. అత్తయ్య గారూ! మీరు ఇక్కడే ఉండండి అంటే 'లేదమ్మా వస్తూంటాలే అక్కడ లేకపోతే పెద్దా డూరుకోడు' అంటూ కొన్నాళ్ళక్కడ, కొన్నాళ్ళిక్కడకి తిరుగుతుంటారు. మీకు మీ అమ్మ గారెంతో నాకూ నా అత్త గారంత."


"ఊ... ఊ... రుజువులు, సాక్ష్యాలు వద్దులే. నీ మంచితనం ఒప్పుకున్నా నరేనా." టిఫిన్ పూర్తి చేసి రవీంద్ర ఆఫీసు కెళ్ళబోతుంటే "బియ్యం మాత్రం మర్చిపోకండి" అంది రాధ.

"బియ్యం షాపుకి ఈ రోజు శలవు, రేపసలు కుదరదు. ఏకంగా సోమవారం చెబుతాలే. నీ ఆలోచన్లు కట్టిపెట్టి ఇవాళ కొంచెం జాగర్తగా ఏరుదూ" అంటూ వెళ్ళిపోయాడు రవీంద్ర.

రాధ తలుపేసుకుని కుక్కరులో పప్పు, అన్నం పడేసి రాత్రి నిద్రలేక బడలికగా ఉండి పడుకుందా మనుకుంటుండగా బియ్యం సంగతి గుర్తొచ్చి బియ్యం ఏరాలి అనుకుంటూ నిద్రని కాస్త పక్కకి పెట్టి కొంచెం కాఫీ కలుపుకొని తాగింది. వంటిల్లంతా సర్ది కుక్కరు దింపి చేటలో బియ్యం పోసుకుని వచ్చి కుర్చీలో కూచుంది ఏరడానికి. ఆ బియ్యం చూస్తేనే భయంగా ఉంది ఎలా ఏరాలా అని. మరీ ఎక్కువగా ఉన్నాయి రాళ్ళు, బెడ్డలు, పెంకు పురుగులు - వద్దు అసభ్యకరమైన చెత్త తెలుగు సినిమాలా ఉన్నాయి ఆ బియ్యం. బియ్యం ఎలాగో ఏరడం మొదలుపెట్టింది తప్పదని. ఎప్పుడు బియ్యం ఏరినా బామ్మ గుర్తుకొస్తుంది. పెళ్ళయి పదేళ్ళవుతోంది. తన పెళ్ళయాక రెండేళ్ళు బ్రతికుంది. తన దగ్గర కొన్నాళ్ళుండి వంటా వార్పూ నేర్పేది పాపం. పెళ్ళి కాని క్రితం "రాధా కొంచెం బియ్యం ఏరమ్మా" అంటూ బియ్యం ఏరడం పని తనకే చెప్పేది. అందుకే బియ్యం ఏరితే ఎప్పుడూ బామ్మ గుర్తొస్తూనే ఉంటుంది రాధకి. అనుకోకుండానే పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయింది రాధ మనసు.

తెల్లవారి అయిదు గంటలైంది. అప్పుడే 'క్..క్కొ...రొ...కో అని ఎక్కడి నుంచో కోడి కూత వినిపించింది. బామ్మ హరినామ స్మరణ కూడా అప్పుడే మొదలైంది. గడియారం అయిదు గంటలు కొట్టడం విని కోడి కూస్తుందో లేక కోడి కూత విని బామ్మ హరినామస్మరణ మొద లవుతుందో, బామ్మ హరినామస్మరణ విని గడియారం అయిదు గంటలు కొడుతుందో తెలీదుగాని మొత్తానికి ప్రతిరోజూ ఈ మూడూ వేళ తప్పకుండా సక్రమంగా జరిగిపోతుంటాయి.

"హరేరామ హరేరామ రామ రామ హరే హరే హరే క్రిష్ణ హరే క్రిష్ణ క్రిష్ణ క్రిష్ణ హరే హరే"... అయ్యో రాముడూ! ఇలా రాకురా, మడి గట్టుకున్నాను. ఇదిగో రాముడూ! ఆ మూల కాకర పాదుంది చూడూ.. నాలుక్కాయ లున్నాయేమో కోసుకురా పులుసులోకన్నా వస్తాయి. అన్నట్టు రాముడూ! ముందర ఆవుపాలు పిండియ్యి. ప్రసాదంలోకి కావాలి. యాకుందేందు తుషారహార ధవళా యాశుభ్ర వస్త్రాన్వితా... అయ్యో రాత్రి పాలు కాసినీ విరిగిపోయాయి. పొద్దుటే కాస్త కాఫీ చుక్క గొంతులో పడందే ఏ పనీ చేయలేను. ఒసేవ్ రాధా! ఇంక నిద్దర్లు లేవండే. పొద్దెక్కాక మా కాలంలో అంతసేపు పడుకోనిచ్చే వారు కాదు. అసలు ఆడపిల్లలు అంత పొద్దెక్కి లేవకూడదు" బద్ధకంగా కదులుతూంటే "ఏమర్రా లేవారా



లేదా? కాఫీలు కలవండే వచ్చి  మళ్లీ ఇంకోసారి బామ్మ ఊదరగొట్టడం మొదలైంది.

ఇంక పడుకుంటే లాభం లేదు. బామ్మ సాధింపుకి నిద్రెలాగూ పట్టదు గాని ఇంక తప్పనిసరిగా నిద్ర మంచం మించి లేచి పక్క గుమ్మంలోంచి బాత్రూమ్‌లోకి వెళ్లి పళ్లు తోముకోబోతే 'టూత్ పేస్టు' కాదు కదా కనీసం 'నంజనగూడు' పళ్లపొడన్నా లేదు. ఒక హార్లిక్సు సీసా నిండా బొగ్గు పొడి, పాత బోర్నవిటా డబ్బాలో సరిపడ సైజులో కోసిన తాటాకు ముక్కలు, ఒక పక్క వందుం పుల్లల కట్ట వేసి ఉన్నాయి. పాపం! బామ్మ రాత్రి పడుకోకుండా పదింటి దాకా కత్తిపీట ముందేసుకుని ఈ తాటాకు ముక్కలు గావును కోసింది. బొగ్గు పొడి కూడా రాత్రే తయారు చేసి చక్కగా సీసా నిండా పోసింది. ఒక పక్క చీపురుకట్టలు కట్టి ఉన్నాయి. మధ్యాహ్నం కొబ్బరీన్లు తీసి ఓపిగ్గా అన్నీ కట్టలు కట్టింది. ఎంత ఓపిక బామ్మకి.

ఇక నా ఆలోచన్లు కట్టిపెట్టి ఆ బొగ్గు పొడితోనే ఎలాగో 'దంతధావనం' కానిచ్చి... ఖర్మ వదిలినట్లే లేదు. ఈ అవతారంతో గమ్మున ఎవరైనా చూడాలిట జడుసుకుంటారు కూడాను. ఏదో పళ్ల పొడి , ప్రకటనకి, మాటింగ్ జరుగుతోం దనుకుంటారు. 'టూత్ పేస్ట్' ప్రియమైందిట. కొనటం మానేశారు. పోనీ పళ్లపొడి కొన్నా బాగుండేది. ఒకసారి కొంటారు అయిపోతే మళ్లీ ఎవరూ పట్టించుకోరు. ఏ నెల్లాళ్లకో, రెండు నెలలకో, లేకపోతే ఇంటికి ఎవరన్నా అతిథులు వచ్చినప్పుడో అప్పటికప్పుడు వెళ్లి తెస్తారు. అందాకా నా ఖర్మకొద్దీ బామ్మ చేసిన ఈ బొగ్గు పొడే గతి, సబ్బు వారం రోజుల్లో అయిపోతోందిట అదీ కొనటం మానేశారు.

"ఖర్మ! పొదుపు పొదుపంటూ విసిగేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది గాని స్వేచ్ఛగా బతుకుదామంటే మనిషికి స్వాతంత్ర్యం లేదు. ఏది కొనాలన్నా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పోనీ సొంతంగా ఇల్లుందని ఉందామంటే పన్ను! పన్ను! పన్ను! ఇంటికి పన్ను అద్దె కిచ్చినట్టు తెలిస్తే మరికాస్త పెంచుతారు. దొడ్లో కాస్త బాత్రూమ్ కట్టుకున్నా పన్నే. వీధిలో కాస్త గట్టు ఎక్కువగా ఉందిట ఆ ఎక్కువకి విడిగా పన్ను కరెంట్‌కి పన్ను ఉద్యోగం చేసినా పన్నే కూచుంటే పన్ను నుంచుంటే పన్ను పన్ను! పన్ను! పన్ను!"

"ఏమే రాధా! లేచావా" మళ్లీ బామ్మ పిలుపు.

"ఆ! ఆ! లేచాను బామ్మా! వచ్చేస్తున్నా!"

ఎలాగో నున్నిపిండి స్నానమైంది. ఖర్మ! అద్దంలో మొహం చూసుకునేసరికి ఇంకా జిడ్డుగానే ఉంది. అక్కడికీ నాలుగుసార్లు బరబరా రుద్దినా జిడ్డు పోలా. మొన్న ఎల్లాగో దాచుకున్న సబ్బు ముక్క కాస్తా ఎలకలు ఊడ్చుకుపోయాయి.



ఆదరణ

"మీ ఇంటి యజమాని నిన్ను తన కుటుంబ సభ్యుల్లో ఒకడుగా ఎంతో ఆదరిస్తున్నాడన్నావు? మరి ఇల్లు ఎందుకు ఖాళీ చేశావ్!"

"నాకొచ్చిన జీతమంతా తనకు ఇచ్చి వేయమంటున్నాడ్రా!"

కలవలపల్లి బాలసుబ్రహ్మణ్యం.
[కరీంనగర్]

ఛీ! పాడు ఎలకలు ఇంటినిండా ఎలకలే. కనీసం పౌడరు కూడా లేనట్టుంది. గేడపై చెయ్యిపెట్టి ఎంత రుద్దినా అసలు గేడ నుంచేగా సున్నం, పోనీ అదన్నా రానుకుందామంటే. ఎన్ని పుష్కరాలైందో వెల్ల వేయించి ఏం కొంపో! ఛీ! ఛీ! ఏం పొదుపులో కనీసవసరాలు కూడా తీరవు. ఈ రోజుల్లో పనివాళ్లు నయం. పాలిస్టరు బట్టలూ, అవీ కడుతున్నారు. అన్ని బాధలూ మధ్యతరగతి వాళ్లే పడుతున్నారు. ఒక్క పాలిస్టరు చీర కొనుక్కునే సరికి బామ్మ విసుక్కుంటుంది.

"ఎందుకే బోల్డు డబ్బు పోసి ఆ పోకు చీరలు? ఆ డబ్బుకి నాలుగు వాయిలు చీరలు కొనుక్కోక" అంటుంది.

అబ్బ! ఈ జిడ్డు మొహానికి ఎంత ముస్తాబు చేసుకున్నా ఒకటే. బామ్మ ఇంకా లేవలేదనుకుని ఒసేవ్ రాధా! అంటూ కంటపడేసరికి ఏదో పని అప్ప చెబుతుంది.

వంటింట్లో అడుగుపెట్టేసరికి బొగ్గుల కుంపటి విసురుకుంటూ నిప్పురవ్వలు మీద పడుతున్నా లెక్కచేయక, అవి సరిగా మండక నానా అవస్థ పడుతూ కాఫీలు కలుపుతోంది "అమ్మా! 'గ్యాస్ స్టౌ' ఒకటి తెప్పించకూడదూ?" అయినా మనకంత అదృష్టం కూడానా! తెప్పించుకుందామంటే అంత డబ్బూ లేదు. ఒకవేళ ఎలాగో తెప్పించినా బామ్మకి మడీ, ఆచారం, ఎంతసేపూ పొయ్యి కుంపటి. ఈ మడి ఆచారాలు ఏ పుణ్యాత్ములు పెట్టిందో గాని ఉన్న వాళ్ల ప్రాణాలు తీస్తున్నారు - ఈ పెద్దాళ్లు.

మొన్న చింతకాయ పచ్చడి అటక మీద మడిగా కుండలో ఉందిట. నిచ్చె నెక్కించి తమ్ముడి చేత - బట్టలు విప్పించి, తీయించింది. తలుపులన్నీ బిడాయించి. పాపమెలాగో తిట్టుకుంటూ కష్టపడి తీశాడు. [అసలు ముందర నన్నే తీయమంది బామ్మ. నే ఛస్తే తీయ నన్నాను.] అయినా ఈ రోజుల్లో అంత ఆచారాలు ఎవరూ చేయకపోయినా ఈ ఇంట్లో మాత్రం ఇంకో పదేళ్లైనా కూడా పోవు పాత చింతకాయ పచ్చడి భావాలు.

"ఇదిగోనే కాఫీ గ్లాసు తీసుకోకుండా ఏమిటలా దేభ్యంలా నిలబడి ఆలోచిస్తున్నావు?" అని అమ్మ అడిగేసరికి ఉలిక్కిపడి కాఫీ గ్లాసు తీసుకుని రాబోతుంటే బామ్మ నన్ను అప్పుడే చూసిందేమో - "ఒసే! ఇప్పుడా లేవడం హవ్వ! అంటూ బుగ్గలు నొక్కుకుని "ఇంత పొద్దెక్కి ఆడపిల్లలు లేవచ్చునా. మా కాలంలో ఇలాగే..."

"అబ్బబ్బ! మా కాలం అంటూ సతాయించకు బామ్మా! ఇది మీ కాలం కాదు. మా కాలం. అయినా నే లేచి చాలా సేపైంది. స్నానం కూడా అయింది" అన్నాను బామ్మతో.

నా ముఖారవిందంలో ఏదో లోప మున్నట్టు "మరి అవతారం అలా ఉందేం" అంది బామ్మ.

"ఏం చేయమంటావు? కొంపలో పేస్టుండదు, సబ్బు లేదు, కనీసం పౌడరన్నా లేదు. బొగ్గు పొడితో తోమిన పళ్లు, నున్నిపిండితో రుద్దుకున్న మొహానికి అంతకన్నా ఎలా వస్తుందిలే అందం?"

"ఏం దెప్పుతావే నా తల్లి! సరే గాని బియ్యంలో రాళ్లేరియ్యి. నాకేమో కన్ను కనిపించదు. మీ అమ్మకి ఈ పనితోనే సరిపోతుంది. పంటి కింద రాయి పడితే నన్ను తిట్టుకుంటారు. ఇవాళైనా జాగ్రత్తగా చూ<sup></sup>సి ఏరు, ఆలోచిస్తూ కూచోకు" అంటూ బియ్యం ఏరే పని అప్పజెప్పింది బామ్మ.


"బాబోయ్! బియ్యంలో రాళ్లేరాలా? ఎంత ఏరినా ఒక్క రాయి కూడా కనిపించదు. అయినా అన్నయ్య పంటి కింద మాత్రం రాయి పడుతూనే ఉంటుంది. అసలు బియ్యం ఏరడం అంటేనే పరమచికాకు. అన్నయ్యకి పంటి కింద రాయి పడితే ఆ కోపం అంతా నా మీద చూపించి పళ్లు బిగపట్టి పాపం! తిట్లు తిట్టే.. అలవాటు లేక "ఒసే! రాక్షసీ నువ్వు... నువ్వు... బియ్యంలో రాళ్లేరుతున్నావా? రాళ్లలో బియ్యం ఏరుతున్నావా" అంటూ సరిగా భోం చేయకుండానే లేచిపోతాడు ఒక్కోసారి. బామ్మ సరేసరి ఆవిడ తినే ఒక పూట భోజనానికి ఎలాగో అలా నమిలి మింగేస్తుంది పళ్లు లేవు కాబట్టి. నాన్నగారయితే సగం రోజులు కేంపులోనే ఉంటారు. ఒకవేళ ఉన్నా ఏదో ధోరణిలో తినేసి వెళ్లిపోతారు పట్టించుకోకుండా. తన కసలు పంటి కింద రాయే పడదు. అయినా "రాళ్లు తిని అరాయించుకోవాలర్రా" అంటుంటుంది బామ్మ. రాళ్లంటే ఈ రాళ్లు కాదేమో!

"అయ్యో అదేమిటే తొందరగా బియ్యం ఏరివ్వమంటే అలా ఆముదం తాగిన-మొహంలా పెట్టి ఏమిటీ ఆలోచిస్తున్నావు? ఏరిన బియ్యం కూడా లేవు. తొందరగా వం టవకపోతే వాడు భోం చేయకుండానే ఆఫీసుకి వెళ్లిపోతాడు" అన్న బామ్మ మాటలకి ఈ లోకంలో కొచ్చాను.

"ఆ...ఆ.. ఇదిగో బామ్మా! ఒక్క అయిదు నిముషాల్లో ఏరిచ్చేస్తా నుండు" అంటూ బియ్యం చేటలో పోసుకున్నా ఏరదామని.

"ఖర్మ! బియ్యం ఏరడం పని ఎప్పుడూ నాకే తగుల్తుంది. అయినా కూర తరగమంటే తరగవచ్చు, లేకపోతే ఇల్లన్నా ఊడవ్వచ్చు, ఏ పనన్నా చేయచ్చు. పోనీ బియ్యంలో మట్టి బెడ్డలైనా ఏరచ్చు కనబడతాయి కాబట్టి, బియ్యంలో రాళ్లు ఎలా ఏరడం? కావాలని ఫ్యాక్టరీల్లో రాళ్లు తయారు చేయించి బియ్యంలో బియ్యంలా కలిసిపోయే తెల్ల రాళ్లు కలుపుతుంటే ఏరేవి బియ్యమో, రాళ్లో కూడా తెలీకుండా ఉంది."

బియ్యంలో రాళ్లు, పాలల్లో నీళ్లు కలపకుండా వ్యాపారం చేయడం కుదరదా? అయినా దేశ మంతా కల్తీమయమై పోయింది. బియ్యంలో కల్తీ, పాలల్లో కల్తీ, నూనెలో కల్తీ, నేతిలో కల్తీ ఏ సరుకు కొనాలన్నా కల్తీ... కల్తీ... ఆఖరికి మందుల్లో కూడా



కల్తీయే. ఎందులో కల్తీ కలిపినా ఆ కల్తీ తిండి తిన్నందు వల్ల కలిగే రోగానికి మందు వేసుకొందామంటే ఆ మందులు కూడా కల్తీ అయితే ఇంక ఆ రోగి పరిస్థితి ఏమని చెప్పాలి? ఇక డాక్టరు చేసే వైద్యంలో జరిగే కల్తీ వేరే చెప్పనవసరం లేదు! ఓ కంటికి ఆపరేషన్ చేయబోయి ఇంకో కంటికి చేయడం. ఆఖరికి రెండు కళ్లూ పోగొట్టడం ఇలా ఎన్నో జరుగుతూనే ఉన్నాయి. అసలు మనుషుల మనస్తత్వాలే కల్తీమయమైపోయాయి.

వైద్య వృత్తి, ఉపాధ్యాయ వృత్తి ఈ రెండూ చాలా పవిత్రమైనవి. కాని ఆ రెండూ ముఖ్యంగా వ్యాపారంగా తయారయాయి. టెన్తు చదివిన వాళ్లు కూడా కాన్వెంటు పెట్టుకు బతుకుతున్నారు. దేశంలో ఎన్ని రకాల అరాచకాలున్నాయో అన్నీ విలయతాండవం చేస్తున్నాయి. దొంగతనాలు, దోపిడీలు, మోసాలు, పట్టపగలే హత్యలు, మానభంగాలు, లంచగొండితనాలు, ఏక్సిడెంట్లు మొదలైనవన్నీ ఈ పవిత్ర భారతదేశంలో కేబరే నృత్యాలు చేస్తున్నాయి. ఇవన్నీ లేకపోతే గనక ఈ బియ్యంలో రాళ్లు ఏరే బాధ తప్పేది కదా! టైమ్ వేస్ట్. హాయిగా కథలన్నా రాసుకునేదాన్ని.

"గాంధీ పుట్టిన దేశమా ఇది నెహ్రూ కోరిన సంఘమా ఇది..." "గాంధీ పుట్టిన దేశం రఘురాముడు ఏలిన రాజ్యం ఇది మమతకు సమతకు సందేశం." "చెడు అనవద్దు చెడు వినవద్దు ఇది బాపూజీ పిలుపు ఇదే మేలుకొలుపు...." "పాడవోయి భారతీయుడా ఆడిపాడవోయి వి...." ఖర్మ! ఇవాళ అక్టోబరు రెండు గావును. ఇం కివాళ రేడియో వినఖర్లేదు. ఇవాళందరూ దేశభక్తులే. మనసుల్లో నిజంగా భక్తిలేని దేశ భక్తులు. ఇంకా ఏ మంత్రిగారో పోతే రేడియోలో కాస్త భక్తి పాటలన్నా వస్తాయి. ఇది మరీ ఆత్మవంచన చేసుకునే దేశభక్తి, ఈ పిచ్చి రేడియో కట్టేస్తే నయం అని ఠక్కున దాని నోరు మూశాను.

"అయ్యో అదేం టందమ్మాయి గోరూ! రేడియో కట్టేసినారు. ఇయాల సొతంత్రం పండగో ఏదో కదా. ఎట్టండి పాటలు. రోజూ పిచ్చి పాటలని కట్టేత్తరు. ఇయాల మంచి పాటలే కదా ఇంచక్కా గాంధీ గారి పాటలు" అంటూ ఇల్లూడుస్తూ దేశ భక్తురాలైన మా పనమ్మాయి 'సైదమ్మ' తెగ బాధపడిపోయింది. చచ్చినట్టు ఆ వీరనారి కోసం మళ్లీ రేడియో పెట్టక తప్పింది కాదు."

"అయినా స్వాతంత్ర్య దినోత్సవాలకి, గాంధీ గారి జన్మదినానికి మాత్రం ఎక్కడ లేని దేశభక్తి ఉప్పొంగిపోతుందేమో ఆకాశవాణి వారికి. ఆ రోజు మాత్రం "బంగారు బాతుగుడ్లు", "లే.... లే.... లే... నా రాజా..." పాటలు అస్సలు వేయరు. ఈ దేశ భక్తి పాటలు మామూలు రోజుల్లో అయితే వినగలంగాని ఆ రోజు మాత్రం వినలేం. మొన్న పక్కింటి మూడేళ్ల పిల్లవాడు "జోతి లక్ష్మి చీలకత్తింది ఆ ఛీలకే చిగ్గేచింది" అంటూ వచ్చీ రాని భాషలో పాడుతుంటే పెద్ద వాళ్లు తప్పని కూడా చెప్పకుండా ఇంకా ముద్దులాడుతున్నారు. కొన్ని పాటలు నలుగుర్లో వినటానికి, కొన్ని సినిమాలు తండ్రి, సోదరులతో చూడటానికి చచ్చేంత సిగ్గుగా ఉంటున్నాయి.

"అబ్బ! ఇందాకట్నించి ఏరినా బియ్యంలో ఒక్క రాయీ కనబడదే. ఆ.... ఇదిగో రాయి. కానీ రాయో, బియ్యం గింజో అనుమానంగా ఉందే. ఆ... నోట్లో వేసుకు చూస్తేనరి తెలిసిపోతుంది."

"కర్... కర్... కర్..." అబ్బే నలగలా. పన్ను కూడా ఊడేలా ఉంది. ఇది రాయే అయితే, ఇలాగయితే ఏరడం కష్టమేనే."

"ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరీ... హరీ... కోకెత్తుకెళ్లింది కొండగాలీ...." "నేడే చూడండి మీ ప్రియమైన వైజయంతి హాల్లో గొప్ప శృంగార రసభరితమైన పూర్తి



మళ్లీ ఎందుకని!

"ఏంటోయ్ ఇంత ఆలస్యంగా జాగింగ్ చేస్తున్నావు? చేతిలో ఆ ఫైల్సేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు మూర్తి

"మళ్లీ ఇంత దూరం ఎవడొస్తాడని ఇటునుండి ఇటే ఆఫీసుకెళుతున్నా"

ఎ. చంద్రకళ
[వరంగల్]

వినోదాత్మక రంగుల చిత్రం పన్నెండు గంటల ఆటతో ప్రారంభం. "మైమరపించే రాత్రి" పెద్దలకు మాత్రమే తప్పక చూడండి. వ్యవధిలేని కారణంగా ఈ ఒక్క రోజు మాత్రమే [ఖర్మ! సినిమాక్కూడా వ్యవధి లేకపోవడ మేమిటి వీడి బొంద పైగా ఇదో గొప్ప చిత్రంట. ప్రతి సినిమాకీ అలాగే వాగుతాడు]. తప్పక చూడండి నేడే. ఇక రాత్రి ఆట 'ఎలక్షన్ రాముడు' భారీ తారాగణంతో నిర్మింపబడ్డ గొప్ప రాజకీయ రంగుల చిత్రం. కుటుంబ సమేతంగా తప్పక చూడండి." రావోయి రావోయి రాలుగాయి రాక రాక వచ్చావు రాత్రి ఉండిపోవోయి...."

ఖర్మ! ఈ సినిమా బండి గో లోకటి యువతీ యువకుల్ని పాడు చేయటానికి ఆ సినిమా బండి మీద అంటించిన ఆ పెద్దలకు మాత్రమే అని ఇంత పెద్ద 'ఏ' వేసి ఆ సినిమా తాలూకు అసభ్యకరమైన బొమ్మల్ని కాలేజీల కెళ్లే విద్యార్థులు, మిగతా వాళ్లు ఆఖరికి చిన్నపిల్ల సహితం వెనక్కి వెనక్కి తిరిగి మరీ చూస్తూ పోతున్నారు. ఆడపిల్లలు మాత్రం సిగ్గుతో తలొంచుకుపోతున్నారు.

"అక్కా! అక్కా! గొప్ప సినిమాట అక్కా. చూసి తీరాలట. ఇదిగో సినిమా పేపరు చూడు" అంటూ ఎనిమిదేళ్ల తమ్ముడు రవి ఎంతో ఉత్సాహంతో సినిమా పేపరు తెచ్చాడు.

"ఛీ! వెధవా! బుద్ధిలేదూ! చదువు మానేసి సినిమా బండి వెంటపడి పేపరు తేవద్దని నీ కెన్నిసార్లు చెప్పాను? పోయి ఎక్కాలన్నీ కంఠతా పట్టు. పైగా గొప్ప సినిమాట అక్కా! అని వర్ణించడం కూడాను."

ఛీ! ఛీ! ఎలిమెంటరీ స్కూలు పిల్లల లగాయితు కాలేజీ విద్యార్థుల వరకు పూర్తిగా సినిమాల ప్రభావంలో పడిపోతున్నారు. అసలు వాళ్లు చదువుకుందుకు కాదు కాలేజీల కెళ్లేది. ఎంతసేపూ సినిమాల గురించి చర్చలు, ఆడపిల్లల్ని ఏడిపించటమూ వాళ్ల పని. అసలు కొన్ని పెద్ద దొంగతనాలు కూడా సినిమాలు చూసే చేస్తున్నారట.

ఇదిగో మొన్న పేపర్లో పడింది ఈ వార్త.

రంగారెడ్డిలో కాలేజీలో ఇంటర్ చదివే అమ్మాయిని ఎవరో ఒక లెక్చరర్ తన వద్దకు ట్యూషన్‌కి రమ్మని రోజూ ఒకటే పోరు పెడుతుంటే ఆ అమ్మాయి రాలేదని ఇద్దరు స్టూడెంట్లని పంపి ఆ అమ్మాయిని ఏడిపించి కాలేజీల్లో గోడల మీద, ఆఖరికి వీధుల్లో గోడల మీద కూడా ఆ అమ్మాయి మీదా నానా అసభ్య రాతలూ రాసి అవమానపరిస్తే ఆ అవమానం భరించలేక పాపం ఆ అభాగ్యురాలు ఒంటి మీద కిరసనాయిలు పోసుకుని అంటించుకుని చచ్చిపోయిందిట.

"నందిగామలో తొమ్మిదేళ్ల బాలికను ఇద్దరు రౌడీలు పైశాచికంగా మానభంగం చేశారు. వార్త తెలిసిన వెంటనే హుటాహుటీన పోలీసులు వచ్చి కేసు నమోదు చేసుకున్నారు."

"ఏలూరులో పట్టపగలే పదకొండు గంటలకి భర్త ఆఫీసు కెళ్లినప్పుడు ఎవరో కాలింగ్ బెల్ నొక్కితే తలుపు తీయగానే లోపలికి ప్రవేశించి భార్యని అతి దారుణంగా కత్తితో పొడిచి మెళ్లో నగలు తీసుకు పరారయ్యారు."

తమ్ముడు రవి అప్పుడే వచ్చిన పేపరు గడగడా చదువుకు పోతున్నాడు. ఇంకా చదవబోతుంటే ఖర్మ ఇంకా ఏం దారుణాలు వినవల్సి వస్తుందోనని "ఒరేయ్ రవీ! ఇంక పేపరు చదవటం ఆపు" అంటూ కేకలేశాను.

"మా మాష్టారు రోజూ పేపరు చదవమన్నా రక్కా. విజ్ఞానం పెరుగుతుందని నువ్వేమో పేపరు చదవద్దు, సినిమాలు చూడద్దు, పత్రికలు చదవద్దు అంటూ ఆంక్షలు పెడతావు. విజ్ఞానం ఎలా వస్తుంది?" అంటూ నేను పెట్టే ఆంక్షలకి వాడి కోపమంతా నా మీద చూపించేశాడు రవి.

"పోనీ చదివితే చదివావు గాని పేపర్లో ఆ విషయాలు తప్ప ఇం కేం కనిపించలేదా?"

"ఏం చేయమంటావు పేపరు నిండా ఆ వార్తలే ప్రతి రోజూ పడేవి. అందుకే అవే చదువుతున్నాను. చూడగా చూడగా పేపర్లకి, పుస్తకాలకి కూడా 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చేలా ఉన్నావు.

[ముగింపు వచ్చేవారం]

